క్లుప్తంగా

వేణుగోపాల్‌రెడ్డికి అభినందన



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని నవోదయ కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం సందడి నెలకొంది. మరోసారి వైఎస్సార్ సీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షుడిగా బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి ఎన్నికయ్యారు. కాలనీలోని పార్టీ కార్యాలయానికి పలువురు నాయకులు వచ్చి ఆయన్ని సత్కరించి, పుష్పగుచ్చాలు అందజేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్ రాజుతో పాటు పలు ప్రజా సంఘాల నాయకులు ఉన్నారు.

జంక్ ఫుడ్‌పై అవగాహన



తాడేపల్లిరూరల్ : వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ సీఈఏ ఆధ్వర్యంలో పెదవడ్లపూడిలో జంక్‌ఫుడ్ వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంక్ ఫుడ్ ఎక్కువగా తినడం వల్ల షుగర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. ఎక్కువ రోజుల నిల్వచేసిన పదార్థాలను తీసుకోవడం వల్ల శరీరంలో కొవ్వుశాతం ఎక్కువగా పేరుకుపోతుందని వివరించారు. సీఈఏ కో ఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ప్రోగ్రామ్ ఇన్‌చార్జి డాక్టర్ సుబ్రహ్మణ్యం, విద్యార్థులు నిర్వహించారు.

పశుగణన సర్వే పరిశీలన



ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి, పొనుగుపాడు, గుండాలపాడు, బేతపూడి, యర్రగుంట్లపాడు, తక్కెళ్లపాడు, శిరంగిపాలెం, 113 తాళ్లూరు గ్రామాల్లో అఖిల భారత పశుగణన సర్వేపై పురోగతిని శుక్రవారం క్షేత్రస్థాయిలో పశు వైద్యాధికారి పీర్ అహ్మద్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పశుగణన చేస్తున్న ఎన్యుమరేటర్లు వాస్తవ గణాంకాలు నమోదు చేస్తున్నారా లేదా అని పరిశీలించినట్లు తెలిపారు. ఇంటింటికి తిరిగి జంతువులు ఎన్ని ఉన్నాయో పరిశీలించి, వాటిని నమోదు చేస్తారని చెప్పారు. అనంతరం యాప్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. సర్వే ద్వారా ఆయా గ్రామాల్లో పశు సంపద హెచ్చు తగ్గులు ఉంటే వాటికి అనుగుణంగా ప్రభుత్వం పాడి రైతుల అభ్యున్నతికి పథకాలు రూపకల్పన చేస్తుందని చెప్పారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

ఇద్దరి ఘర్షణ.. ఒకరికి తీవ్ర గాయాలు

మంగళగిరి టౌన్ : ఇద్దరు వ్యక్తుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో అందులో ఒకరికి తీవ్ర గాయాలు కాగా ఆసుపత్రికి తరలించిన ఘటన ఆలస్యంగా గురువారం వెలుగులోకి వచ్చింది. మంగళగిరి పట్టణ పోలీసుల వివరాల మేరకు.. మంగళగిరికి చెందిన ఊట్ల కనక మల్లికార్జునరావు తన వాహనంపై వెళ్తుండగా.. మార్గ మధ్యంలో గోలి రామాంజనేయులు అనే వ్యక్తి ఇంటి వద్ద ఇద్దరూ గొడవపడ్డారు. ఇద్దరి మధ్య పాత గొడవల నేపథ్యంలో దాడి చేసుకున్నారని తెలిపారు. దాడిలో రామాంజనేయులు కనక మల్లికార్జునరావు తలపై రాయితో మోదడంతో అతనికి తీవ్ర గాయలయ్యాయి. మల్లికార్జునరావును చికిత్స నిమిత్తం ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు. ఊట్ల కనక మల్లికార్జునరావుపై కొట్లాట కేసు, గోలి రామాంజనేయులుపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. గోలి రామాంజనేయులను కోర్టుకు హాజరుపరిచి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

సేంద్రీయ ఎరువులతో ఆదాయం

డీపీఓ సాయికుమార్



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపీసీ (చెత్త శుద్ధి) షెడ్డును గురువారం డీపీవో సాయికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెత్తశుద్ధి షెడ్డులో పది రోజుల కిందట వానపాములు వేశారని చెప్పారు. మరోకొద్ది రోజుల్లో పూర్తి స్థాయిలో ఎరువు తయారవుతుందన్నారు. దీనిద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందని తెలిపారు. ఇదేవిధంగా పలు గ్రామాల్లో ఉన్న షెడ్లలో కూడా వానపాములు వదిలి పూర్తి స్థాయిలో సేంద్రీయ ఎరువు తయారు చేసుకోవాలని, దీంతో పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందన్నారు. అన్ని గ్రామాల్లో ఈవిధానం అమలు పరిచేలా చేయాలని ఈవోపీఆర్డీ వెంకటేశ్వర్లుకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ ఈవో ఏకేబాబు, సిబ్బంది ఉన్నారు.

మిడిసిపడుతున్న పసిడి

- రూ.లక్ష దాటిన కిలో వెండి ధర
- తగ్గిన బంగారు ఆభరణాల అమ్మకాలు
- మాఘ మాసంలోనూ జోరందుకోని వ్యాపారం
- పెరిగిన ధరలతో పేద, మధ్య తరగతి దూరం
- స్వర్ణకారులపై ప్రభావం.. తగ్గిన పనులు



బంగారు ఆభరణాలు

తాడేపల్లిరూరల్ : రోజురోజుకు పెరుగుతున్న బంగారం ధరలు అదరహో అనిపిస్తున్నాయి. అయితే ఇది బంగారంపై పెట్టుబడి పెట్టిన వారికి శుభపరిణామం కాగా, సామాన్యుడికి మాత్రం ఆర్థిక భారంగా మారింది. ఈ ఏడాది జనవరి నుంచి పసిడి ధరలు మిడిసిపడుతున్నాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.86,670కు చేరింది. చైనా భారీగా బంగారం కొనుగోలు చేయడం, అమెరికాలో ప్రభుత్వ మార్పు, డాలర్‌తో రూపాయి మారకం విలువ పడిపోవడం ధరల పెరుగుదలకు కారణంగా నిపుణులు చెబుతున్నారు. అలాగే కొన్ని రోజులుగా స్టాక్ మార్కెట్‌లో ఒడిదుడుకులతో మదుపరులు సురక్షితమైన పెట్టుబడిగా బంగారం వైపు చూస్తున్నారు. మరోవైపు వెండి ధర కూడా పెరుగుతోంది. ప్రస్తుతం వెండి కిలో రూ.1,07,000 చేరింది. ముంబై మార్కెట్ ధరలను పోలి వ్యాపారం జరుగుతోంది.

పెళ్లిళ్ల సీజన్... కనిపించని ప్రభావం

మంగళగిరి నియోజకవర్గంలో వేలాది మంది స్వర్ణకారులు బంగారు ఆభరణాలు తయారు చేస్తూ జీవిస్తున్నారు. మాఘ మాసం రావడంతో పెళ్లిళ్ల సీజన్‌లో తమకు పని బాగా ఉంటుందని స్వర్ణకారులు భావించారు. ప్రతి సంవత్సరం ఈ సీజన్‌లో ఆభరణాలు తయారు చేయడంలో రాత్రి పగలుతేడా లేకుండా పనిచేసేవారు. కానీ, బంగారం ధర పైపైకి వెళ్లడంతో పనులు పెద్దగా లేవని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెళ్లిళ్ల సీజన్‌లోనూ జ్యూయలరీ దుకాణాలు వెలవెలబోతున్నాయి. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా రూ.కోటి వరకు అమ్మకాలు తగ్గినట్లు అంచనా. అంటే దాదాపు 50 శాతం అమ్మకాలు పడిపోయాయి.

సామాన్యుడిపై ఆర్థిక భారం

బంగారం కొనుగోళ్లు పేద, మధ్య తరగతి వారికి ఆర్థిక భారంగా మారాయి. ముఖ్యంగా పెళ్లిళ్లలో బంగారం ప్రధాన పాత్ర వహించడంతో ఆడపిల్లల కుటుంబ సభ్యులు పెరిగిన బంగారం ధరలతో మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు, తిరిగి అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు పెళ్లిళ్లు ఉన్న నేపథ్యంలో రోజురోజుకు పెరుగుతున్న బంగారం ధరలు చూసి పేద, మధ్య తరగతి కుటుంబాలు హడలిపోతున్నాయి.

50 శాతానికి పడిపోయిన కొనుగోళ్లు

వేగంగా పెరుగుతున్న బంగారం ధర వల్ల బంగారం కొనుగోళ్లు 50 శాతం మేర పడిపోయాయని బులియన్ వ్యాపారులు చెబుతున్నారు. మంగళగిరి నియోజకవర్గ పరిధిలో బంగారం పనిచేసేవారు 40 శాతానికి పైగా ఉన్నారు. గతేడాది మే నెల ముందు వరకు నియోజకవర్గ వ్యాప్తంగా రూ.కోట్లలో బంగారంపై వ్యాపారం జరిపితే నేడు అందులో 50 శాతానికి కూడా వ్యాపార లావాదేవీలు జరగడం లేదని బంగారు వ్యాపారులు వాపోతున్నారు.

పెరుగుదలకు కారణం

గత రెండేళ్లుగా బంగారం పెరుగుదలకు బులియన్ వ్యాపారాలు చెబుతున్న కారణాలు ఇలా ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర పెరగడం, డాలర్‌తో విలువ రూపాయి విలువ రూ.84 నుంచి రూ.87 పడిపోవడం, ఇతర రంగాల్లో నష్టాలు రావడంతో సేఫ్టీగా భావించి బంగారం కొనుగోళ్లు పెంచడం ఇందుకు కారణంగా చెబుతున్నారు. ముఖ్యంగా ఇటీవల అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాల వల్ల బంగారం ధరలు పెరుగుతున్నట్లు వ్యాపారులు చెబుతన్నారు.

చిరు వ్యాపారులకు చాలా ఇబ్బంది



మంగళగిరిలో చిన్న చిన్న బంగారు పనులు చేసుకునే వాళ్లు వేలాదిమంది ఉన్నారు. బంగారం ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో గిరాకీలు లేవు. దీంతో వందలాది మంది చిన్న వ్యాపారులు షాపులు మూసుకునే పరిస్థితి వచ్చింది. ధర తగ్గితే గానీ బంగారం కొనే పరిస్థితి లేదు.

– కాటా బత్తుల వెంకట శేషగిరిరావు, బంగారు వ్యాపారి.

వ్యాపారాలు స్తంభించాయి



బంగారం ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో వ్యాపారాలు స్తంభిస్తున్నాయి. బంగారం కొనుగోళ్లు 50 శాతం వరకు తగ్గిపోయాయి. రెండు నెలల నుంచి ధరలు వేగంగా పెరుగుతుండడంతో ఆ ప్రభావం కొనుగోళ్లపై కనిపిస్తోంది. పెళ్లిళ్లు ఉన్నవారు, తప్పని సరి పరిస్థితుల్లో కొనుగోలు చేయాల్సిన వారు మాత్రమే బంగారం కొంటున్నారు.

– కొల్లి లక్ష్మీ గిరిధరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్, ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం

పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ తనిఖీ

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించి, స్టేషన్ చుట్టూ తిరిగి పరిసరాలు పరిశీలించారు. పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలని చెప్పారు. నూతనంగా ప్రవేశపెట్టిన మహిళ సహాయ కేంద్రం గురించి ప్రజలకు అవగాహన కలిగేలా చూడాలని సీఐ రవీంద్రబాబుకు సూచనలు చేశారు.

విద్యుద్దీపాలు ఏర్పాటు చేస్తాం



సాక్షి ఎఫెక్ట్

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని బేతపూడి దాసులకాలనీలోని సమస్యలపై గురువారం ప్రచురితమైన ఊరిలో రంగ హరీ వార్తకు అధికారులు స్పందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శి ఉమాశంకర్, సర్పంచి గంథూళి ఆదంబీ దాసుల కాలనీలో గురువారం పరిశీలించారు. రెండు దారులు మట్టి రోడ్డుతో ఉండి సైడు కాల్వలు లేకపోవడంపై ఉన్నతాధికారులతో మాట్లాడుతామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్డు వేయించేలా కృషి చేస్తామని సర్పంచ్ ఆదంబీ తెలిపారు. అదేవిధంగా కాలనీ నుంచి గ్రామంలోకి వెళ్లే దారిలో వీధి దీపాలు త్వరలో ఏర్పాటు చేస్తామన్నారు. తాగు నీటికి ప్రస్తుతం ఇబ్బంది లేదని అవసరమైతే బావి చుట్టూ గోడ నిర్మించి గిలకలు ఏర్పాటు చేసేలా చూస్తామని చెప్పారు. చెరువును పరిశీలించి దానిని ఉపయోగపడేలా చేస్తామన్నారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఇంజినీరింగ్ అసిస్టెంట్ బాజీ ఉన్నారు.

యూనిక్ నంబరుకు నమోదు చేసుకోవాలి



దుగ్గిరాల: రైతులందరూ తమ పాసుబుక్, ఆధార్ కార్డులను ఆన్‌లైన్ చేయించుకోవాలని ఏడీఏ ఉషారాణి సూచించారు. మండల గ్రామమైన కంఠంరాజు కొండూరులో గురువారం వ్యవసాయశాఖ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా ఇస్తున్న యునిక్ నంబర్ల కోసం నమోదు చేయించుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. మండల పరిధిలో ఉన్న రైతుల వివరాలను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్ చేయించుకోని వారు వెంటనే రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని సూచించారు. సమావేశంలో ఏఈవో రాజవంశీ, పలువురు వ్యవసాయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

మంగళగిరి టౌన్ : శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అత్యధిక జనాభా ఉన్న బీసీల ఆదాయం పెంచేలా బడ్జెట్‌లో ఆర్థిక విధానాలు రూపొందించాలన్నారు. బలహీన వర్గాల అభివృద్ధితోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. వివిధ బీసీ కులాల కార్పొరేషన్లకు, బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు కూడా బీసీ మంత్రిత్వ శాఖ ద్వారా కేటాయించిన నిధుల ద్వారానే పంపిణీ చేయాలని పేర్కొన్నారు. బీసీల అభివృద్ధి కోసం సంబంధిత మంత్రిత్వ శాఖ ద్వారా విడుదలైన నిధులు సక్రమంగా సద్వినియోగం అయ్యేలా చూడాలని ఆయన ఆ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వేమారెడ్డి



కన్వీనర్లను సత్కరించిన వైఎస్సార్ సీపీ సమన్వకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల కాలంలో ప్రజలకు ఏమి చేయకపోగా.. ఎన్నికలలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నెరవేర్చలేకపోయారని వైఎస్సార్ సీపీ మంగళగిరి సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి విమర్శించారు. గురువారం ఆత్మకూరు జాతీయ రహదారి వెంట ఉన్న పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మండల, పట్టణ కన్వీనర్లను ఆయన ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ.. చంద్రబాబు అబద్ధాలు, మోసాలను, ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా, కరోనా రెండేళ్ల పాటు ఇబ్బందులకు గురిచేసినా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతో పాటు, చెప్పనవీ నెరవేర్చారన్నారు. టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని వేమారెడ్డి కోరారు. రానున్న ఎన్నికలో వైఎస్సార్ సీపీ ఖచ్చితంగా విజయం సాధిస్తుందని, పార్టీ కార్యకర్తలు ప్రతి ఒక్కరికి న్యాయం జరుగుతుందన్నారు. నూతనంగా ఎన్నికైన మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి పట్టణ, రూరల్, దుగ్గిరాల మండల అధ్యక్షులు ఆకురాతి రాజేష్, నాలి వెంకటకృష్ణ, బుర్రముక్క వేణుగోపాలరెడ్డి, అమరా నాగయ్య, తాడిబోయిన శివగోపయ్య వేమారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీ అభివృద్ధికి మరింత కృషి

దుగ్గిరాల: వైఎస్సార్ సీపీ దుగ్గిరాల మండలాధ్యక్షుడిగా నియమితులైన చింతలపూడి గ్రామానికి చెందిన తాడిబోయిన శివగోపయ్య పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డిని గురువారం మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తన నియమాకానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శివగోపయ్య మాట్లాడుతూ బీసీ సామాజానికి చెందిన తనను మండల అధ్యక్షుడిగా నియమించారని, వైఎస్సార్‌సీపీ బీసీ పెద్ద పీఠం వేస్తుందనడానికి ఇదే నిదర్శనమన్నారు. పార్టీ నాయకులు నాగేశ్వరరావు, ధనుంజయ్ పాల్గొన్నారు.

కేఎల్‌యూ విద్యార్థినికి ఫ్రాన్స్ ట్రావెల్ అవార్డు



లక్ష్మీ సౌమ్య (ఫైల్)

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీలో విద్యనభ్యసిస్తున్న పరిశోధన విద్యార్థి ఫ్రాన్స్ ట్రావెల్ అవార్డుకు ఎంపిక అయినట్లు వర్శిటీ ప్రో వీసీ డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ యూనివర్శిటీలో బయో టెక్నాలజీ విభాగంలో పీహెచ్‌డీ విద్యార్థిని లక్ష్మీ సౌమ్య ఈమని న్యూరో కెమిస్ట్రీ ఫ్రాన్స్ ట్రావెల్ అవార్డుకు ఎంపికయినట్లు తెలిపారు. మెదడులోని నరాలకు కలిగే పలు రకాల వ్యాధులపై ఆమె పరిశోధన చేస్తోందని, పార్కిన్సన్ అనే వణుకుడు వ్యాధికి కర్కుమిన్ గ్లెకోసైడ్ అనే గ్రంథం మాలిక్యుల్‌ని ఉపయోగించి నూతన ఔషధాలను కనిపెట్టడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. పరిశోధనల కోసం అమెరికాలోని ప్రముఖ పరిశోధన శాలకు పంపడానికి ఫ్రాన్స్‌కు చెందిన అంతర్జాతీయ పరిశోధన సమాజం వారు లక్ష్మీ సౌమ్యను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ సంవత్సరం ఆగష్టు 14 నుంచి 24 వరకు యూఎస్‌లో జరుగనున్న అంతర్జాతీయ సదస్సులో పాల్గొని, పలు రకాల పరిశోధనలను నిర్వహించి తిగిరి భారత్‌కు ఆగష్టు 25న చేరుకుంటుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుండి కేవలం ఒక్కరిని మాత్రమే ఫ్రాన్స్ వారు ఎంపిక చేశారని, లక్ష్మీ సౌమ్య ప్రయాణ ఖర్చులతో పాటు వసతి తదితరాలను ఫ్రాన్స్ ట్రావెల్ అవార్డు కింద వారే చెల్లిస్తారని జగన్నాధరావు అన్నారు. ఈ సందర్భంగా వర్శిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె. రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టన్ ఎన్ వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్‌కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్ ప్రసాద్, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ వి. ప్రవీణ్ తదితరులు లక్ష్మీ సౌమ్యను అభినందించారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చండి



మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు



శిక్షణ ఇస్తున్న మంగళగిరి సీడీపీఓ సులోచన

దుగ్గిరాల: పోషణ ఎంత ముఖ్యమో, చదువు అంతే ముఖ్యమని దుగ్గిరాల ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు పేర్కొన్నారు. దుగ్గిరాలలోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో పోషణ్ భీ, పడాయి భీ కార్యక్రమంపై శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నుంచి ఆరు సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలను అంగన్‌వాడీలో చేర్చే విధంగా చూడాలన్నారు. అలాగే వారికి ప్రభుత్వం అందించే బలవర్ధకమైన ఆహార పదార్థాలను సకాలంలో పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో ఎంఈవో కాజా శ్రీనివాసరావు, జిల్లా వైద్యశాల వైద్యురాలు డాక్టర్ పావని, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భవానీ, పలువురు అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అంగనవాడీ టీచర్లకు శిక్షణ

మంగళగిరి: ఐసీడీఎస్ ప్రాజక్టు మంగళగిరి పరిధిలోని అంగనవాడీ టీచర్లు 40 మందికి మూడు రోజులు పాటు శిక్షణ తరగతులు గురువారం నగర పరిధిలోని కాజ ప్రాథమిక పాఠశాలలో ప్రారంభమయ్యాయి. ఐసీడీఎస్ సీడీపీఓ సులోచన శిక్షణా కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సూపర్‌వైజర్లు శ్రీదేవి, వేణుకుమారి పాల్గొన్నారు.

మంగళగిరి టౌన్: మంగళగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ భీ పఢాయి భీ శిక్షణా కార్యక్రమాలు గురువారం ప్రారంభమయ్యాయి. మంగళగిరిలో జరిగిన కార్యక్రమంలో సీడీపీఓ సులోచన బాల్యవిద్య ప్రాముఖ్యతను వివరించారు. మంగళగిరి సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, వేణుకుమారి, సరిత, భవాని, ఎం.వాణి, ఎన్. భవాని, రత్నకుమారి, శ్రీదేవి, సిరోమణి, నిర్మల, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మణరావుకు మద్దతుగా ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న రైతు సంఘం నాయకులు



కరపత్రాలు అందజేస్తున్న చేస్తున్న బాలరాజు, నాగమల్లేశ్వరరావు

తాడేపల్లిరూరల్: కృష్ణా, గుంటూరు జిల్లాల ఉమ్మడి గ్రాడ్యుయేట్స్ పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును మరోసారి గెలిపించుకుందామని ఏపీ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు అన్నారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని కుంచనపల్లిలో లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టి రంగారావు, నల్లపు కిషోర్ బాబు పాల్గొన్నారు. మంగళగిరి రూరల్ పరిధిలోని యర్రబాలంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు యు. రాజశేఖర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను కోరారు. ప్రజా సంఘాల నాయకులు ఎ.వీర వెంకయ్య, ఎం.రవి, రాధిక, అరుణ్, ఆంథోని, రామరాజు పాల్గొన్నారు.

దుగ్గిరాల: గుంటూరు-కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావుకు అందరూ ఓట్లు వేసి గెలిపించాలని సంఘం నాయకులు జెట్టి బాలరాజు కోరారు. తుమ్మపూడి గ్రామంలో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కార్మిక సంఘ నాయకులు గ్రాడియేట్ ఓట్లు ఉన్న వారిని కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎన్నికల్లో లక్ష్మణరావును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.నాగమల్లేశ్వరరావు, వి.చిరంజీవి, జి.కార్తీక్, ఎం.భాను, గోపి, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

మణిపాల్ హాస్పిటల్‌కు ఏహెచ్‌పీఐ అవార్డు



అవార్డు అందుకున్న డాక్టర్ టి. శ్రీనివాస్ రావు

తాడేపల్లిరూరల్ : భారతదేశంలోని అసోసియేషన్ ఆఫ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ (ఏహెచ్‌పీఐ) ప్రతిష్టాత్మక ఎక్సలెన్స్ ఇన్ హెల్త్‌కేర్ అవార్డు (2024)ను మణిపాల్ హాస్పిటల్ క్రిటికల్ కేర్ సేవల్లో ఎక్సలెన్స్ ఇన్ క్రిటికల్ కేర్ సర్వీసెస్ పురస్కారాన్ని అందుకున్నట్లు మణిపాల్ హాస్పిటల్ విజయవాడ క్లస్టర్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి తెలిపారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ హాస్పిటల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అవార్డును ఈ ఏడాది జనవరి 31, ఫిబ్రవరి 1న కేరళ రాష్ట్రం కొచ్చిలో జరిగిన వేడుకల్లో అందజేశారన్నారు. అవార్డును హాస్పిటల్ తరపున డాక్టర్ టి. శ్రీనివాస్ రావు (క్రిటికల్ కేర్ విభాగాధిపతి), డాక్టర్ ఉత్తమ్ శర్మ (మెడికల్ సూపరింటెండెంట్)లు స్వీకరించారని తెలిపారు.

19లోగా పీఎల్‌వీలకు దరఖాస్తు చేసుకోవాలి

తెనాలిరూరల్: పారా లీగల్ వలంటీర్‌గా పని చేసేందుకు ఆసక్తి ఉన్న వారు ఈ నెల 19వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ డి. శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు, విశ్రాంత ప్రభుత్వోద్యోగులు, సీనియర్ సిటిజన్‌లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, వైద్యులు, విద్యార్థులు, లా విద్యార్థులు అర్హులని చెప్పారు. ఆసక్తి ఉన్న వారు ఈ నెల 19 సాయంత్రంలోగా మండల న్యాయసేవాధికార సంస్థ కార్యాలయంలో నేరుగా లేదా పోస్టు ద్వారా తమ దరఖాస్తులను అందజేయవచ్చని సూచించారు.

కార్యకర్తకు వేమారెడ్డి పరామర్శ

మంగళగిరి టౌన్ : మంగళగిరి రూరల్ పరిధిలోని పెదవడ్లపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పిడుగు రాహుల్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న మంగళగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి గురువారం రాహుల్‌ను ఇంటికి వెళ్లి పరామర్శించారు. రాహుల్‌కు ధైర్యం చెప్పి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రూరల్ అధ్యక్షులు నాళి వెంకట కృష్ణ, నాయకులు దాసు, అగస్టీన్, యస్‌కె బాజి, దుర్గ, శివయ్య, వంశీ, భరత్, నూరిల్లా, సద్దాం, కరీముల్లా పాల్గొన్నారు.

ముగిసిన పేరంటాలమ్మ తిరునాళ్ల

దుగ్గిరాల: పెనుమూలి గ్రామంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పారుపూడి వీరమ్మ పేరంటలమ్మ తిరునాళ్ల గురువారంతో ముగిశాయి. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో అమ్మవారి ఊరేగింపు, కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. గురువారం సిరిబండి ఊరేగింపు గ్రామంలో వైభవంగా జరిగింది. భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు పరనాళ్ల రామనాథం పర్యవేక్షించారు.

బహుమతుల ప్రదానం



దుగ్గిరాల: ఎఫ్ఏ-3 పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థినులకు గురువారం ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభాదేవి బహుమతులు ప్రదానం చేశారు. దుగ్గిరాలలోని జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులను అభినందించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.